# 6 అల్లిక పిట్ట



**నేపథ్యం:**

● రకరకాల పక్షులు వాటి నివాసస్థానాల చిత్రాలను అంతర్జాలం నుండి సేకరించి ఒక చక్కని తరగతి ఆల్బమ్ తయారు చేయండి. అల్లిక పిట్ట నేర్పరితనం ఎంత గొప్పగా ఉంటుందో ఈ గేయంలో చూద్దామా!

ఎంతనేర్పరీ గిజిగాడు
వింత అల్లికల మొనగాడు
లోకంలో ఎక్కడ వెతికిన
ఇంతటి ఘనుడూ కనరాడు.

తాటీ ఈత చెట్లకు పోయి
నోటి తోటి నారను చీరీ
కడకొమ్మ మనసుకు నచ్చి
పోసపోస గూడుగ కూర్చె.

అదే తన మేడనుకొని
మేడలోన గుండెను దాచి
ఎండా వాన చలిగాలులలో
బతుకును గెలిచే పిట్టలరేడు.

గిజిగాని గూళ్ళను చూసి
చిత్రకళలు పుట్టినవేమో !
అగ్గి పెట్టెల పట్టే చీరలు
అతి నాజూకుగ అల్లిండ్రేమో !



## I. వినండి–చెప్పండి.

1. పిట్టలు గూళ్ళను ఎక్కడ, ఎందుకు కడతాయి ?
2. గూటిలోని పిల్లలకు ఆహారాన్ని పక్షులు ఎలా అందిస్తాయి ?
3. కాకి గూటిలో గుడ్లను పెట్టే పిట్ట ఏది ?
4. కోడిగుడ్డు పిల్లగా ఎలా మారుతుందో చెప్పగలవా ?

## II. సంభాషించండి.

1. పక్షులు వేటిని ఉపయోగించి గూళ్ళను నిర్మిస్తాయి?
2. గూడును అల్లే పురుగు ఏదో చెప్పండి ?
3. ఏయే చెట్ల నుండి నారను తీయవచ్చు?
4. నారతో తయారు చేసే కొన్ని వస్తువుల పేర్లను చెప్పండి.

## III. కొత్త పదాలు నేర్చుకుందాం.

ఘనుడు = గొప్పవాడు;
కడకొమ్మ = కొమ్మ చివర; పోస = పోచ (ఒక నారపీచు); రేడు = రాజు.

## IV. చదవండి–చెప్పండి–రాయండి.

### అ. ఒక్కొక్క వాక్యంలో జవాబులు రాయండి.

1. వింత అల్లికల మొనగాడెవరు ?
2. గిజిగాడు ఏయే చెట్లనుండి నారను తీస్తాడు?
3. చిత్రకళలు వేటిని చూసి పుట్టి వుంటాయని కవి అన్నారు ?

### ఆ. మూడు, నాలుగు వాక్యాల్లో జవాబులు రాయండి.

1. గిజిగాడు గూడును ఏవిధంగా కూరుస్తాడో రాయండి.
2. గిజిగాడు అల్లిక గూడు ఎవరెవరిని ఎలా ప్రభావితం చేసిందని కవి అన్నారు?

### ఇ. ఖాళీలను పూరించండి.

1. లోకంలో ఎక్కడ వెతికిన ఇంతటి ________ కనరాడు.
2. కడకొమ్మ మనసుకు నచ్చి ________ గూడుగ కూర్చె.
3. ఎండా, వాన, చలి గాలులలో బతుకును గెలిచే ________
4. గిజిగాని గూళ్ళను చూసీ ________ పుట్టినవేమో.

## V. భాషావగాహన :

### అ. సొంతవాక్యాల్లో ఉపయోగించండి.

1. నేర్పరి 2. ఘనుడు 3. నాజూకుగా

### ఆ. గీతగీసిన పదాలు ఏ భాషాభాగాలో రాయండి.

1. ఎంత నేర్పరి <u>గిజిగాడు</u>.
2. పోసపోస గూడుగ <u>కూర్చె</u>.
3. బతుకును గెలిచే పిట్టల <u>రేడు</u>.
4. <u>అతినాజూకుగా</u> అల్లింద్రేమో !

### ఇ. వాక్యాంగములను గుర్తించండి.

1. అల్లిక పిట్ట నోటితో నారను చీరును.
2. గిజిగాడు గూడును కూర్చెను.

### ఈ. సృజనాత్మకత :

మీరు చూచిన ఆయా పక్షుల గూళ్ళను చిత్రీకరించి రెండు, మూడు వాక్యాలు రాయండి.

### సమాచార ఖజానా తెరుద్దాం:-

**'గిజిగాడు'** అనే పిట్ట పిచ్చుకను పోలి ఉంటుంది. ఇవి మేత మరియు గూటి నిర్మాణానికి కావలసిన నారగడ్డి లభించే గడ్డి ప్రదేశాలలో, పొలాల్లో గుంపులు, గుంపులుగా కనబడతాయి. ఎంతో నైపుణ్యంతో నారతో అల్లిన గూళ్ళను మనం రైళ్ళలో వెళ్తూ కూడా చెట్లకు చూడవచ్చు. ఈ గూళ్ళు సాధారణంగా నీటి ఒడ్డున ఈత, ముళ్ళ చెట్లకు నీటిపై వేలాడుతుంటాయి. ఈ కారణంగా అవి శత్రువుల బారినుండి రక్షింపబడతాయి.

ఈ పిట్టను గురించిన ఆసక్తికరమైన ఇతర విషయాలను అంతర్జాలంలో చదివి తెలుసుకోండి.